క్లుప్తంగా

బాలకార్మిక చట్టంపై అవగాహన



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి యు. రామ్మోహన్ ఆదేశాల మేరకు పట్టణం, రూరల్ మండలంలోని పలు సచివాలయాల్లో బాలకార్మిక నిర్మూలన చట్టం గురించి న్యాయవిజ్ఞాన సదస్సులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ బాల కార్మిక నిర్మూలన జరిగితేనే వందశాతం అక్షరాస్యత సాధ్యమవుతుందని, 14 సంవత్సరాల వయస్సు లోపు వారిని పనులకు పంపకూడదని తెలిపారు. బాలలను పనిలో పెట్టుకుంటే ఆ సంస్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ పఠాన్ గౌస్ మొహిద్దీన్‌ఖాన్, జి.నాగరాజు, పి.రమణరెడ్డి, ఎస్. రమణారావు, పారా లీగల్ వలంటీర్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జి. చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌లు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజయవాడలో నూతనంగా నిర్మిస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయ నిర్మాణం గురించి చర్చించారు. అనంతరం ఇరువురిని స్థానిక ఆర్యవైశ్య పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి బంగారయ్య, నగేష్, పెరుమాళ్ల అమర్‌నాథ్, పెండేల శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, ఎం.నరసింహారావు, ఎస్. లక్ష్మీనారాయణ, జి.శ్రీనివాసరావు, మస్తాన్‌రావు, కె.కోటేశ్వరరావు, ఆర్. కోటేశ్వరరావు, అంజి, అన్నా మల్లికార్జునరావు, సైదారావు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేక ఉత్సవాలు

నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండ రోడ్డు శ్రీనివాసనగర్‌లో వేంచేసియున్న శ్రీగోదా పద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి పాంచాహ్నిక 12వ మహా కుంభాభిషేక బ్రహ్మోత్సవం, శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలను ఈనెల 11వ తేదీ ఆదివారం నుంచి 16వ తేదీ శుక్రవారం వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి మల్లిపెద్ది సాంబశివరావు శనివారం తెలిపారు. ఆలయంలో 11వ తేదీన ఉత్సవాలకు అంకురార్పణ, 12న ధ్వజారోహణం నిర్వహిస్తామన్నారు. 13వ తేదీన శ్రీవారి కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ, స్వామివారి తిరువీధి ఉరేగింపు, 14వ తేదీన శ్రీసుదర్శన నారసింహ హోమం, 15వ తేదీన అష్టోత్తర శతకలశ స్నపన తిరుమంజనం, 16వతేదీన ఆలయశిఖర మహాకుంభ సంప్రోక్షణ, పుష్పయాగం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారని వివరించారు. భక్తులు ఆయా కార్యక్రమాలలో పాల్గొని శ్రీవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్ష

వినుకొండ (నూజెండ్ల): నూజెండ్లలోని మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశాలకు ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సి.పద్మజ శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉదయం 9గంటల లోపు పాఠశాలకు చేరుకోవాలని తెలిపారు.


చెరువులో పడి యువకుడి మృతి

చిలకలూరిపేటటౌన్: ప్రమాదవశాత్తు మంచి నీటి చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మండలంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన సకలా ఉమేష్‌చంద్ర(24) సీఏ చదువు పూర్తి చేశాడు. శుక్రవారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై పట్టణానికి తాగునీరు అందించే కొత్తచెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. బయటకు వెళ్లిన కుమారుడు తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో గాలింపు చేపట్టిన బంధువులు చెరువు వద్ద ద్విచక్రవాహనం గమనించి చెరువులో చూడగా పాదరక్షలు కనిపించటంతో చెరువులో గాలించారు. ఈ క్రమంలో ఉమేష్ చంద్ర మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఒంగోలులోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





మరుగుదొడ్ల పరిస్థితి నాడు - నేడు





చేతులు శుభ్రం చేసుకునే పరిస్థితి నాడు - నేడు

మారిన బడులు – మారనున్న రాతలు

'ప్రపంచాన్ని మార్చాలంటే శక్తివంతమైన ఆయుధం చదువొక్కటే' అని నల్లసూరీడు నెల్సన్ మండేలా చెప్పిన చక్కటి మాట. 'సంపదకంటే చదువే గొప్పది / ఎందుకంటే సంపదను మనం కాపాడుకోవాల్సి ఉంటుంది. కానీ చదువు మనల్ని కాపాడుతుంది'. అందుకే చదువును నిర్లక్ష్యం చేయకూడదంటారు పెద్దలు. 'చదువు చేదుగా ఉంటుందన్న మాట నిజమే అయినా తరువాత అది ఇచ్చే ఫలాలు ఎప్పుడూ తియ్యగానే ఉంటాయన్నది కూడా వాస్తవమే'. అలాంటి చదువు కొనసాగాలంటే కావాల్సింది చక్కటి పాఠశాల.. అందులో కావల్సిన వసతులే. వీటిని పిల్లలకు సాకారం చేసి చూపించారు ముఖ్యమంత్రి జగన్ మామ. 'అన్నదానం ఆకలిని మాత్రమే తీరిస్తే.. అక్షర దానం అజ్ఞానాన్ని తొలగిస్తుందన్న' మాటని ఆయన అక్షరాలా చేసి చూపించారు బొల్లాపల్లి మండలంలో.



నాడు ఎటువంటి ప్రహరీ లేక కొనసాగిన పాఠశాల



నేడు రూపురేఖలు మారిపోయిన కనుమల చెరువు ప్రాథమికోన్నత పాఠశాల

- నాడు–నేడు పథకంతో పాఠశాలల్లో సమూల మార్పులు!
- అభివృద్ధికి శ్రీకారం చుట్టిన పాలకులు
- సత్ఫలితాలు ఇస్తున్న ప్రభుత్వ నిర్ణయాలు
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా..

బొల్లాపల్లి: గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు దారుణమైన స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నూతన భవనాలు, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కోట్లాది రూపాయల నిధులతో పాఠశాలల ఆధునీకరణతో పాటు విద్యార్థులకు నూతన క్లాస్ రూంలు, బెంచ్‌లు, బాత్ రూంలు, ఆర్వో వాటర్‌తో పాటు ఇంగ్లిష్ మీడియం, ఉచిత యూనిఫాం, డిజిటల్ క్లాస్‌రూంలు, బైజూస్ ట్యాబ్‌లు అన్ని రకాల వసతి సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది. అంతేకాకుండా కేవలం పేదరికంతో చదువులు ఆగిపోకూడదని ఉద్దేశంతో అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో పాటు యూనిఫాం, బ్యాగ్స్, పుస్తకాలు ఉచితంగా అందజేశారు.

79 పాఠశాలలు.. 7 వేల మంది విద్యార్థులు

బొల్లాపల్లి మండలంలో మొత్తం 79 పాఠశాలలు ఉండగా 7 వేల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఈ మండలంలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో విద్యను అభ్యసిస్తున్నారు. మండలంలో మొత్తం 63 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 4 ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, ఒక మోడల్ స్కూల్ ఉన్నాయి. అయితే నాడు–నేడు పనుల కింద మొదటి దశలో 26 పాఠశాలలను ఆధునీకరించారు. కొన్ని పాఠశాలల్లో అదనపు తరగతి గదులను కూడా నిర్మాణం చేశారు. అలాగే రెండవ దశలో 40 పాఠశాలలు నాడు–నేడు పనులకు ఎంపిక చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా విద్యార్థులకు నాణ్యమైన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం సఫలమైందని అభిప్రాయం వ్యక్తమవుతుంది. వెనుకబడిన ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పనులతో పాటు విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులు పేదప్రజలకు వరంలా మారాయి. రానున్న రోజుల్లో ఇలాంటి ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన పథకాలు సత్ఫలితాలు ఇస్తాయనడంలో సందేహం లేదు.

పేద విద్యార్థులకు ఉపయుక్తం



ముఖ్యమంత్రి చేపట్టిన నాడు–నేడు పనులు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగం. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు అలంకారప్రాయంగానే ఉండేవి. ప్రస్తుతం జగనన్న పరిపాలనలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేపట్టడంతో వెనుకబడిన ప్రాంతాల్లో విద్యార్థులకు చదువులు ఆగిపోకుండా కొనసాగుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంతో రానున్న రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయి.

– కె.శెట్టినాయక్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, కనుమలచెరువు





సౌకర్యాల లోపంతో నాడు ఇలా...



అన్ని సౌకర్యాలతో నేడు

ఉచిత టైఫాయిడ్ టీకా శిబిరం



శావల్యాపురం: మండలంలోని గంటావారి పాలెం గ్రామం ఎస్టీ కాలనీలో ఉచితంగా టైఫాయిడ్ టీకా శిబిరం దాతల సహకారంతో నిర్వహించినట్లు బొల్లాపల్లి మండల ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజరు, వివేకానంద యూత్ పూర్వవిద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. ఈశిబిరాన్ని ప్రముఖ గిన్నిస్‌బుక్ రికార్డు గ్రహీత వేల్పూరు వాసి మొగలి సుభాష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆరోగ్య సూపర్‌వైజరు మాట్లాడుతూ 0–2 నుంచి 40 సంవత్సరాల లోపు వారంతా టీకా వేయించుకోవచ్చునని, ఒక డోసు టీకా వేయించుకున్న వారికి మూడు సంవత్సరాల వ్యాధి రాదని వివరించారు. ఈటీకా సురక్షతమైనదనీ, ఎటువంటి సైడు ఎఫెక్ట్స్ లేవన్నారు. టైఫాయిడ్ జ్వరం కలుషితమైన నీరు, ఆహారంలో ఈగలు, క్రిముల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.పరమేశ్వర రావు, సురేష్, గోపీ కాలనీయూత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాండురంగ స్వామి వార్షికోత్సవం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరరామంలో వేంచేసియున్న రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారికి శనివారం రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వార్షికోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా శనివారం వేకువజామున స్వామివారికి పంచసూక్తయుత పంచామృతస్నపన నిర్వహించారు. స్వామివారిని అనేక రకాల పుష్పమాలలు విశేషాలంకారం చేశారు. అనంతరం స్వామివారికి విష్వక్సేనపూజ, ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి సహస్రనామార్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జీవితాల్లో వెలుగులు నింపేలా జగనన్న పాలన

- అందరికీ ఉచిత వైద్యం, విద్య, ఇళ్ల నిర్మాణాలు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: కార్మికులు, కర్షకులు, చేనేతలు, చేతివృత్తుల వారు ఇలా అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 11వ వార్డు పరిధిలోని రూత్‌డైక్‌మెన్ కాలనీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో మంత్రి రజిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదేనని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వెల్లడించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావి పౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిషు మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామన్నారు. రూ. 16 వేల కోట్లతో గ్రామస్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. దేశానికే ఆదర్శవంతంగా నిలిచేలా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ప్రవేశ పెట్టారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని వివరించారు. జగనన్న కాలనీలలో పేదవారి సొంతింటి కలలు సాకారం అవుతాయని వివరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో సొంతిల్లు లేని వారంటూ ఉండరని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, యార్డు డైరెక్టర్ షేక్ అబ్దుల్ గని, నాయకులు కొమ్మతోటి శ్రీను, షేక్ సుభాని, ఆటోవలి, చెంచయ్య, బాలకోటి, పుట్టాల అక్కులయ్య, ఖాజావలి, షేక్ ఆరీఫ్, బేరింగ్ మౌలాలి, సాపా సైదావలి, తియ్యగూర వీరారెడ్డి, తిరుమల దేవి పాల్గొన్నారు.

ఐదు పాఠశాలల హెచ్‌ఎంలు బదిలీ

వారి స్థానంలో నూతన హెచ్‌ఎంలు బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఓ ప్రధానోపాధ్యాయుడు

రొంపిచర్ల: మండలంలోని ఐదు జిల్లా పరిషత్‌ల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు బదిలీ కాగా, ఆ స్థానాల్లో నూతనంగా ప్రధానోపాధ్యాయులు శనివారం బాధ్యతలను స్వీకరించారు. రొంపిచర్ల జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న షేక్ మొహిద్దీన్‌సాహెబ్ బదిలీకాగా, ఆ స్థానంలో పాలపాడు పాఠశాల ప్రధానోపాధ్యా యులు షేక్ సుభాని నియమితులయ్యారు. అలాగే సంతగుడిపాడు హెచ్‌ఎం పి.జ్యోతిర్మయి బదిలీకాగా, ఆ స్థానంలో శావల్యాపురం మండలం సందెపూడి ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు.

అలాగే రెడ్డిపాలెం జెడ్పీపాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న మాధవీలత బదిలీకాగా ఆ స్థానంలో పుసులూరు ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. అలాగే కొత్తపల్లి పాఠశాల హెచ్‌ఎం బి.మల్లికార్జునరావు స్థానంలో పెదనందిపాడు మండలం ఉప్పల పాడు జెడ్పీపాఠశాల హెచ్‌ఎం టి.మాధవి బాధ్యతలు స్వీకరించారు. గోగులపాడు జెడ్పీహెచ్‌ఎం పి.అన్నపూర్ణ స్థానంలో నరసరావుపేట మండలం యల్లమంద హెచ్‌ఎంగా పనిచేస్తున్న హనుమంతరావు బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రధానోపాధ్యాయులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వైభవంగా నూతన దేవాలయాల ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న బొల్లా గిరిబాబు

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామంలో నూతన దేవాలయాలు విజయ గణపతి, మహాశీతలి, బొడ్రాయి, గమిడిశీతలి, పోలేరమ్మ తల్లి, పోతురాజు, వీరబ్రహ్మేంద్రస్వాముల, నీలంపాటి అమ్మవారి దేవాలయాల ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం ఉదయం 7.35 నిమిషాలకు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామివార్లను దర్శించుకున్న వారిలో సర్పంచ్ తిరివిధి శివకుమారి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు బొల్లా గిరిబాబు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు, తిరివిధి రమణారావు, శ్రీనివాసరావు, చినకంచర్ల గ్రామ సర్పంచ్ పురేటి నాగేశ్వరరావు, మండల కోఆర్డినేటరు పాపసాని సురేష్, గ్రామస్తులు పాల్గొన్నగా భారీ అన్నదానం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

దొండపాడులో వైభవంగా విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



దొండపాడులో ప్రతిష్ఠించిన 30 అడుగుల భారీ అభయాంజనేయ స్వామి విగ్రహం

నరసరావుపేట రూరల్: మండలంలోని దొండపాడులో 30 అడుగుల శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ భారీ క్రేన్ సాయంతో ఉదయం 8 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ప్రతిష్ఠలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ పేరం రాజానందరెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిన్నపురెడ్డి శివారెడ్డి, నవులూరి రామిరెడ్డి, పుట్లూరి రామకోటిరెడ్డి, మూరే రవీంద్రారెడ్డి, వంపుగుడి జాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 1500 పోలీసు సిబ్బందితో బ్రీఫింగ్

క్రోసూరు: సోమవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రోసూరుకు రానున్న సందర్భంగా ఆదివారం ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 1500 మందితో పోలీసు సిబ్బందికి బ్రీఫింగ్ కార్యక్రమం ఉంటుందని ఎస్‌బి మహబూబ్‌సుభాని తెలిపారు. అదేవిధంగా సీఎం రాక పట్ల పటిష్ఠ బందోబస్తు చేసేందుకు పోలీసు సిబ్బందికి ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తగుసూచనలు చేస్తారని తెలిపారు. పోలీసుల పేరేడ్ ఉంటుందని తెలిపారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు



రాజుపాలెం: ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదరు గాల్పులకు మండలంలోని పలు గ్రామాల్లో, పొలాల్లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫారంలు పడిపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లినట్లు ఏఈ ప్రసాద్ శనివారం తెలిపారు. పడిపోయిన, ఇరిగిపోయిన స్తంబాల స్థానాల్లో కొత్త స్తంబాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రెండు ట్రాన్స్‌ఫారంలు పూర్తిగా దెబ్బతినడంతో కొత్త ట్రాన్స్‌ఫారంలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మండలంలో రాజుపాలెం, కొత్తూరు, గణపవరం, బలిజేపల్లి, రామిరెడ్డిపేట తదితర గ్రామాల్లోని పొలాల్లో సుమారు 20 పోల్స్ పడిపోయాయి. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టామని ఏఈ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com